## క్లుప్తంగా

### ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు



పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వీసీపల్లి: ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని వేపగుంపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గడ్డం బాలసుబ్బయ్య పొలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలమృతం, పంచామృతం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గడ్డం బాలసుబ్బయ్యను ఆదర్శంగా తీసుకొని ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరమణ, ఎంపీడీఓ సుబ్బారావు, ఏఈఓ పుల్లయ్య, గోపీకృష్ణ, వీపీఏ మనోహర్ పాల్గొన్నారు.

### అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దృశ్యం

పామూరు: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో శాశ్వత అన్న ప్రసాదం కోసం ఒంగోలుకు చెందిన బాపనపల్లి శ్రీనివాసులు, సుగుణకుమారి దంపతులు ఇటీవల రూలక్ష నగదు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో విరాళం నగదు రూ.1,00,116లను సాయిబాబా ఆలయ చైర్మన్ పబ్బతి వెంకట సుబ్బయ్యకు దాత ప్రతినిధి తిరుపతయ్య అందజేశారు. అన్నదానం కోసం విరాళం అందజేసిన దాతకు చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీహరి, పాప, అర్చకులు చంద్రకాంత్ ద్వివేది, భక్తులు పాల్గొన్నారు.

### సీపీఎం సీనియర్ నాయకుడు నరసింహం మృతి

గుడ్లూరు(కందుకూరు): సీపీఎం సీనియర్ నాయకుడు, మండలంలోని చేవూరు గ్రామానికి చెందిన నూతలపాటి వెంకట నరశింహం(80) అనారోగ్యంతో గురువారం చేవూరులోని ఆయన స్వగృహంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గత 15 రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆరోగ్యం విషమించి మృతి చెందారు. వెంకట నరశింహం నియోజకవర్గంలో సీపీఎం సీనియర్ నాయకులుగా గుర్తింపు పొందారు. గతంలో చేవూరు సర్పంచ్‌గా పనిచేయడంతో పాటు, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సీపీఎం నాయకులుగా వివిధ పదవుల్లో పనిచేశారు. వెంకట నరహింహం మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు.



వెంకట నరశింహం(ఫైల్)

### రెండు రోజుల్లో వీధిలైట్ల పునరుద్ధరణ

పామూరు: పామూరులో షార్ట్ సర్క్యూట్‌తో గురువారం కాలిపోయిన సుమారు 80 వీధిలైట్ల స్థానంలో రెండు రోజుల్లో కొత్తలైట్లు పునరుద్ధరిస్తామని పీఎస్ వి.బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పామూరులోని సీఎస్‌పురం మెయిన్‌రోడ్డు, చెన్నకేశవనగర్, ఎస్సీకాలనీ, మండల పరిషత్ కార్యాలయం వరకు లైట్లు కాలిపోయినట్లు పేర్కొన్నారు.

### పారిశుధ్యంపై దృష్టి సారించండి



పెద్దగొల్లపల్లిలో పారిశుధ్య పనులు చేయిస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. పెద్దగొల్లపల్లిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను గురువారం ఆమె పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా బయటకు వెళ్లేలా చూడాలని సూచించారు. కార్యదర్శి కొండయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

### విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలంవారిపల్లె కదిరి వెంకట నరసయ్య, లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో గురువారం పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను ఎంఈఓ రాజాల కొండారెడ్డి, హెచ్‌ఎం నాగినేని తిరుపతయ్య పంపిణీ చేశారు.

# తల్లిపాలు బిడ్డకు అమృతం



కనిగిరి ర్యాలీలో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్



గుడ్లూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కామేశ్వరి

వెలిగండ్ల: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని సీడీపీఓ సరోజినీదేవి అన్నారు. తల్లిపాలు వారోత్సవాల మొదటిరోజు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ దేవిరెడ్డి రామిరెడ్డి, డాక్టర్ మౌనిక, సూపర్‌వైజర్లు కమలకుమారి, దేవకృపావరం, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మంద్రు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది, సామ్యూల్, రసూల్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

లింగసముద్రం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని పెదపవని-1, -2, ముత్యాలపాడు సచివాలయాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తల్లిపాల వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని చేవూరు సచివాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కె కామేశ్వరి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి ఆహారం తల్లిపాలు అని, పుట్టిన వెంటనే తల్లిపాలను ఇవ్వడం ద్వారా బిడ్డ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. తల్లిపాలను తక్కువ చేసి చూడకుండా వాటి ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. పుట్టిన గంటలోపే పాలు ఇవ్వడంతో పాటు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీని వల్ల బిడ్డ అనేక వ్యాధుల బారి నుంచి రక్షించబడతాడని వివరించారు. అలాగే తల్లులు కూడా మధుమేహం, బీసీ, ఊబకాయం వంటి వ్యాధులను రక్షణ పొందవచ్చునని చెప్పారు. కావున తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి మహిళా గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి క్రిష్ణ, ఏఎన్‌ఎం పి అనూరాధ, కార్యకర్తలు కె నళిని, పి హెలెన్‌కుమారి, కె సునీత, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, పాట్లేళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని కూనిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో రెండో సెక్టార్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు ఉషారాణి, కళ్యాణి, హెల్పర్లు సుశీలమ్మ, గోవిందమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వెలిగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



పెదపవనిలో తల్లిపాల వారోత్సవాలు

కనిగిరి రూరల్: తల్లి పాలు ఎంతో శ్రేష్టమని, అమృతంతో సమానమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖల అధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ పి.సరోజని, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఎం డాక్టర్ సృజన, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాల ఊసేదీ..?

ఉలవపాడు: తల్లిపాల వారోత్సవాలు... ప్రతి ఏటా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్యక్రమం, కానీ ఈ ఏడాది ఈ కార్యక్రమంపై ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించినట్లు కనిపించడం లేదు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముందుగానే ప్రచారం నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల్లో, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశాలలో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేవారు. గర్భిణులు, తల్లులకు ఈ కార్యక్రమాల్లో అవగాహన కల్పించి తల్లిపాల గురించి వివరించేవారు. కానీ ఉలవపాడు మండలంలో తల్లిపాల వారోత్సవాలు అనే కార్యక్రమం ఉందనే విషయాన్ని అధికారులు మర్చిపోయారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రభుత్వం ఈ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలి. కానీ మండలంలో వైద్యశాలలో కానీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కానీ ఈ వారోత్సవాలు ప్రారంభించకపోగా 7 వ తేదీ లోగా జరగాల్సిన కార్యక్రమాల గురించి ఎటువంటి సమాచారం అటు వైద్య సిబ్బంది కి కానీ, ఇటు అంగన్‌వాడీలకు కానీ ఇవ్వలేదు. గతంలో ప్రభుత్వాలు ఎంతో ప్రచారం నిర్వహించి ఈ కార్యక్రమాలను నిర్వహించేవారు. కానీ ఈ ఏడాది దాని ఊసేలేదు.

**పట్టించుకునేదెవరు..?**

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉలవపాడు కేంద్రంగా ప్రాజెక్టు నిర్వహణ జరుగుతుంది. ప్రాజెక్టు పరిధిలో ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాలు ఉంటాయి. ఉలవపాడు ప్రాజెక్టు కేంద్రమైన ఉలవపాడు మండలంలోనే తల్లిపాల వారోత్సవాల గురించి పట్టించుకున్న వారేలేరు. ఇక మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి అసలు వారోత్సవాలు ఉన్నాయి అన్న విషయం కూడా తెలియదు. మండల పరిధిలో 77 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఒక్క అంగన్‌వాడీ కేంద్రంలో కూడా తల్లిపాల వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం జరగలేదు. వైద్యశాలలో గర్భిణులు, బాలింతలను పిలిచి వైద్య సిబ్బంది సూచనలు అందించాలి కానీ ఉలవపాడు పరిధిలో ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం, రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఎక్కడా వారోత్సవాలు ప్రారంభమైన దాఖలాలు లేవు.

**ఇప్పుడైనా మేల్కొంటారా..**

జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉలవపాడు తొలిరోజు కనీసం ఆ కార్యక్రమం గురించి పట్టించుకొని అధికారులు మిగిలిన ఆరు రోజులైనా కార్యక్రమాలు నిర్వహించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఐసీడీయస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వారోత్సవాల కార్యక్రమాలు జరగలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సీడీపీఓ అరుణ వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

# పొగాకు గరిష్ట ధర కేజీ రూ.359



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం 891 బేళ్లు కొనుగోలయ్యాయి. చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాల రైతులు 1035 బేళ్లను వేలానికి ఉంచగా 144 బేళ్లు తిరస్కరణకు గురయ్యారు. గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.315.06 పలికింది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

**కొండపిలో 1000 బేళ్లు కొనుగోలు**

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో గురువారం 1000 బేళ్లు కొనుగోలు చేసినట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకళ్లగుంటకు చెందిన రైతులు 1088 బేళ్లు వేలానికి ఉంచగా 88 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.286.79 పలికింది. వేలంలో 16 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

### పచ్చిరొట్ట పంటలతో భూమి సారవంతం



అనంతవరంలో పచ్చిరొట్ట పంటలను పరిశీలిస్తున్న ఆర్‌ఎం లక్ష్మణరావు

టంగుటూరు: పచ్చిరొట్ట పంటలతో భూమి సారవంతమై నాణ్యమైన దిగుబడి పొందవచ్చని పొగాకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు పేర్కొన్నారు. గురువారం ఆయన వేలం కేంద్రాన్ని పరిశీలించి వివిధ గ్రేడ్ల ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు క్షేత్ర సిబ్బందితో కలిసి అలకూరపాడు, అనంతవరం గ్రామాల్లో పచ్చి రొట్ట పైర్లను పరిశీలించారు. పచ్చిరొట్ట పంటలతో కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు.

### పెన్షన్ పంపిణీ పరిశీలన

కొండపి(సింగరాయకొండ): మండలంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కొండపి మండల ప్రత్యేకాధికారి, జిల్లా హౌసింగ్ పీడీ ఈ.పేరయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కొండపి ఎంపీడీఓ నాగమణి, హౌసింగ్ ఏఈ భూపతి, ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై తీర్పును స్వాగతిస్తున్నాం



ఆనందం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



టంగుటూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

టంగుటూరు: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బక్కా తిరుమలరావు పేర్కొన్నారు. స్థానిక బొమ్మల సెంటర్లో గురువారం ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు గజీవనరావు విగ్రహాలకు పూలమాలలు వెసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశీర్వాదం, మంద జయరావు, బక్కా సుదర్శన్, కొమ్ము చిట్టిబాబు, రావినూతల మదన్, రావినూతల రాజు, శిఖా కోటయ్య, బక్కా శశికుమార్, జల్లి శ్రీకాంత్, పసుమర్తి చిరంజీవి, పసుమర్తి రాఘవులు, పందిటి హనోక్, గంగవరపు ప్రకాశం, కొమ్ము బాబు, కొమ్ము ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

సింగరాయకొండ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేతల రాజారాం పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో సంబరాలు చేసుకున్నారు. సుప్రీం తీర్పును ఉద్యమంలో అమరులైన వారికి అంకితం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రావినూతల ఏడుకొండలు, మన్నం రాజేష్, గడ్డం భాస్కర్, ఇతర గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

### తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

కొండపి(సింగరాయకొండ): తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఐ.ప్రియాంక పేర్కొన్నారు. మండలంలోని పెట్లూరు అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఆగస్టు ఒకటి నుంచి 7వ తేదీ వరకు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవజాత శిశువులకు తల్లిపాలు అమృతంతో సమానమని, ఆ పాలలో బిడ్డకు సరిపడా పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి ఉంటాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

### సచివాలయాల మూతపై జనాగ్రహం



తెరుచుకోని అనంతవరం సచివాలయం

టంగుటూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛను పంపిణీ బాధ్యతలను ఉద్యోగులకు అప్పగించడంతో వారు రోజువారీ విధులకు దూరంగా ఉండాల్సి వస్తోంది. కొండపి నియోజకవర్గంలోని గ్రామ సచివాలయాల సిబ్బంది గురువారం తెల్లవారుజాము నుంచే పింఛను పంపిణీలో పాల్గొనడంతో పలు సచివాలయాల తలుపులు కూడా తెరుచుకోలేదు. టంగుటూరు మండలంలోని అనంతవరం సచివాలయానికి తాళాలు వేసి ఉండటంతో పనులపై వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

### చెరువులో చెట్లు నరికితే చర్యలు

కొండపి(సింగరాయకొండ): చెరువులో చెట్లను నరికితే చర్యలు తప్పవని ఇరిగేషన్ ఏఈ మధుబాబు హెచ్చరించారు. చెరువులో అక్రమంగా చిల్లకంప తొలగింపుపై 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై ఏఈ స్పందించారు. గురువారం ఆయన కొండపిలోని చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులో తుమ్మకర్ర, చిల్లకర్రను తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఈ విషయమై చర్యలు తీసుకునేలా పంచాయతీ అధికారులకు సిఫార్సు చేస్తామన్నారు.

# గంగయ్య భౌతికకాయానికి దద్దాల నివాళి



గంగయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, ఇతర నేతలు

హనుమంతునిపాడు: వాలిచర్ల పంచాయతీ మాజీ సర్పంచ్ ఆళ్లా గంగయ్య భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాలనారాయణ, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న గంగయ్య గురువారం స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాయకులు గ్రామానికి వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సర్పంచ్ మరియబాబు, మాజీ సర్పంచ్ సంఘ అధ్యక్షుడు గాండ్ల పర్తి ఆదినారాయణ, బొబ్బిల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ బాలకృష్ణ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి

కనిగిరి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి అన్నారు. మండలంలోని చీర్లదిన్నె, పాతపాడు పంచాయతీల్లో పశుగణాభివృద్ధి సంస్థ, పశువర్ధక శాఖల ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ బత్తుల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ పశువులకు వచ్చే వ్యాధులపై పశుపోషకులు అవగాహన కల్గి ఉండాలన్నారు. మూగ జీవాలకు తక్షణ వైద్యాన్ని అందించాలని, పశు వైద్యాధికారుల సూచనలు పాటించాలన్నారు. పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య శిబిరంలో సుమారు 76 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు నిర్వహించారు. అనంతరం 150 మంది పాడి రైతులకు ఉచితం గా మినరల్ మిక్సర్, వివిధ రకాల మందులు పంపిణీ చేశారు. ఉప సహాయ సంచాలకుడు డాక్టర్ యోగేంద్ర ప్రసాద్, డాక్టర్ రమేష్, రైతులు తాళ్ల శ్రీను, బాసు, రమణారెడ్డి, గోపాలమిత్ర రామయ్య, రేష్మా, డాక్టర్ బాషా, వెంకటేశ్వరరెడ్డి, వాసు, వెంకటేష్, శివ, హబీబ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల కమిటీల ఏర్పాటుకు చర్యలు



పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. సి.నాగులవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన సమావేశంలో ఎంఈఓలు మాట్లాడుతూ నోటిఫికేషన్ జారీ, ఓటర్ల జాబితా ప్రదర్శన పూర్తయినందున 5వ తేదీ తుది ఓటర్ల జాబితా రూపొందించాలని, 8వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ప్రతి తరగతికి ముగ్గురు వంతున సభ్యులను ఎన్నుకుని వారి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో అలసత్వం, నిర్లక్ష్యం తగదని ఎన్నికల ప్రక్రియలో లోపాలకు కఠిన చర్యలు ఉంటాయన్నారు. మండలంలో నూరుశాతం విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను పంపిణీచేశామని, ఎవరైనా కొంత సామగ్రి తీసుకోకపోతే తక్షణం తీసుకుపోవాలన్నారు.

# సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయం



హర్షం వ్యక్తంచేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, ఉద్యోగులు

పామూరు: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో మాదిగ ఉద్యోగ సమాఖ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాదిగ ఉద్యోగ సంఘ మండల అధ్యక్షుడు రాచూరి ఏలియా మాట్లాడుతూ 3 దశాబ్దాల నుంచి మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలకు ఇది ఫలితమని, పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు శేషం మోసే, పలువురు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



ఉచిత పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్

కనిగిరి రూరల్: ప్రభుత్వ పథకాలు, రాయితీలు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యాభివృద్ధిలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్‌లు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి, సి.సంజీవి, మాజీ వైస్ చైర్మన్ వీవీఆర్ మనోహర్‌రావు, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, ఎస్‌కే ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, ఎస్‌కే రిజ్వాన్, తిరుపాలు పాల్గొన్నారు.